# ప్రశ్న



ఇచ్ఛాపురపు జగన్నాథరావు

"మీ రేమిటో చాలా పరధ్యానంగా ఉన్నారు" అంది, అలిసిపోయినట్టు నిట్టూర్పు విడుస్తూ శకుంతల. చాలా సేపటినించి ఆమె రేవతిని గమనిస్తోంది. రేవతి ఏమిటో తెగ ఆలోచిస్తూన్నట్టు ఉంది.

"సారీ...." అంది రేవతి నిద్రనించి మేలుకొంటున్నట్టు శకుంతల మీదికి కళ్లు తిప్పి. అరగంటనించి ఏదో చెప్తోంది ఆవిడ. ఎవరెవరిని గురించో రహస్యాలూ, సిగ్గుచేటు కబుర్లూను. మొదట కొంచెం ఆసక్తితోనే వింది రేవతి. కాని క్రమంగా అవి వినడం మానేసింది. మాటలు చెవుల్లోకి వెడుతున్నా వాటి అర్థమేమీ ఆమెకి తెలియలేదు. "ఏమిటి అన్నారూ ?" అంది మళ్లాను. శకుంతలని నొప్పించడం ఆమెకి ఇష్టంలేదు. నిజానికి ఎవర్నీ నొప్పించడం ఆమె కిష్టం ఉండదు.

"అదే. మిసెస్ శేఖర్ గురించి చెప్తూంటే మీరు నిద్రపోయారు." అంది శకుంతల చిత్రంగా చిరునవ్వు నవ్వుతూ.

"ఏదో ఆలోచలో పడిపోయాను." అంది రేవతి అన్ని ఆలోచనలకీ ఫుల్ స్టాప్ పెడుతూ.

"అదెలెండి బుధవారం క్లబ్ మీటింగుకి వొస్తున్నారుగా ? ఈ మధ్య మీరు అసలు అటెండెన్స్ ఇవ్వడమే మానేశారు. అందరూ ఫిర్యాదు చేస్తున్నారు. ఎంత ప్రేమ అయినా వారానికి ఒక్క సాయంత్రం పతిదేవులని విడిచి ఉండలేరా మన రేవతి అంటున్నారు. ఈ సారైనా తప్పకరండి," అంది శకుంతల.

"అలాగే. ఆలాగే. తప్పకుండా వొస్తాను....". అని లేచి నిలబడింది రేవతి.

"ఒకసారి గార్డెన్‌లోకి వెళ్ళి వస్తాను. ఆయన ఏంచేస్తున్నాడో ఏమో ! పార్టీ అంటే తెగ తాగుతాడు." అంటూ రేవతి జవాబుకి ఎదురుచూడకుండానే బయలుదేరింది శకుంతల. ఆవిడ వెనక్కి తిరక్కుండా బయటికి వెళ్ళిపోయింది. ఆపకుండా మాట్లాడ్డంలాగే ఆగకుండా వెళ్లడం ఆమెకి అలవాటులా ఉంది అనుకుంది రేవతి.

పదకొండు దాటింది.

పార్టీకి వొచ్చినవాళ్లంతా అటూ ఇటూ చిన్న చిన్న గుంపుల్లో కూర్చున్నారు. సాయంత్రం చక్కగా అమర్చిన కుర్చీలు ఎవరికి కావలిసినట్టు వాళ్లు తిరిగి వేసుకున్నారు. గార్డెన్‌లో అక్కడా అక్కడా రెండో మూడో దీపాలు వెలుగుతున్నాయి. ఆడా మగా పొదల పక్కనా చెట్లకిందా నీడల్లోనూ చిన్న గుంపుల్లో కూర్చున్నారు. అదంతా చాలా సేపటినించీ హాల్లో కూర్చున్న రేవతి గమనిస్తోంది. చాలామంది చేతుల్లో గ్లాసులు ఉన్నాయి. బేరర్స్ ప్రతీ పది నిమిషాలకీ అందరి దగ్గరికీ వెళ్ళి అడిగిన వాళ్ల గ్లాసులు నింపుతున్నారు. ఇవన్నీ చూస్తోన్న రేవతి భర్తకోసం కళ్లతోనే వెతుకుతోంది.

ఇరవై నిమిషాల కిందట అతను అటు వేపు మామిడిచెట్ల కిందకి వెళ్లడం చూసింది. అప్పటికి నాలుగైదు నిమిషాల ముందు, "ఇప్పుడే వొస్తాను రేవతీ. ఛటర్జీతో చిన్న పని ఉంది' అని చెప్పి వెళ్లేడు. అందుకే అతనలాగ వొంటరిగా వెళ్లడంచూసి ఆశ్చర్యపడింది రేవతి. మరో నాలుగైదు నిమిషాల తరవాత కళ్యాణికూడా అటే వెళ్లడం గమనించింది రేవతి. ఇప్పటిదాకా ఎదురు చూసింది. ఇద్దరూ బయటికిరాలేదు. ఆ నీడల్లో ఎక్కడో ఉన్నారు.

ఏమిటి జరుగుతోంది ?

జీవన్‌కి కల్యాణితో ఏంపని ? అదీ అర్ధరాత్రి సమయాన మసక చీకట్లో ? తనతో అబద్ధం ఆడి తనని వదలివెళ్లాల్సినంత పని ఏమిటది ?

అతి నెమ్మదిగా బయటకివచ్చి గార్డెన్‌లోకి నడిచింది రేవతి.

కొత్త సంవత్సరం కొంచెం సేపటిలో రాబోతూంది. తన జీవితంలోనూ కొత్త మలుపు రాబోతుందా అన్న ఆలోచన వచ్చింది ఆమెకి. పెళ్లయాక సంవత్సరం దాటింది. జీవన్ ఎప్పుడూ ఇలాగ చెయ్యలేదు. అతనిలో వేలెత్తిచూపదగిన లోపం

ఏమీలేదు. అందుకే తానూ అతన్ని ఆరాధించగలిగింది. అతనూ అంతే. రేవతి అంటే ప్రాణంకన్నా ఎక్కువగా చూసుకుంటాడు.

ఇవేళ ఈ పార్టీలో ఏమైంది?

తనఆలోచన తప్పేమో! వాళ్లిద్దరూ కాక అక్కడ ఇతరులు కూడా ఉండవొచ్చును. జీవన్ ఎప్పటి మనిషే కావొచ్చును.

కాని, అలా అని కళ్లతో చూసి తెలుసుకుంటే గాని తనకి మనశ్శాంతి ఉండదు.

పలకరించిన ఒకరిద్దరికి ఏదో చెప్తూ రేవతి వీలైనంత దూరంగా వెళ్లింది-జీవన్, కళ్యాణి వెళ్లిన వేపు. స్పష్టంగా ఏమీ కనిపించడం లేదు గాని దూరంగా చెట్టుకింద ఇద్దరూ నిలబడి ఉండడం చూసింది రేవతి.

కొంచెం పరిశీలనగా చూశాక అతను జీవన్ అనీ, ఆమె కళ్యాణి అనీ, సందేహం లేకుండా తేలింది.

మసక వెలుతురులో అతను ఆమె భుజంమీద చెయ్యివేసి, దగ్గరగా నిలబడి మాట్లాడుతున్నట్టు కనిపిస్తోంది.

"మీరూ ఇక్కడికే వొచ్చారా?" అంటూ ఎదురుగా నిలబడింది శకుంతల.

"అవును.... ఇక్కడ బాగుంది."

"న్యూఇయర్ రాగానే డిన్నర్ సెర్వ్ చేస్తారుట...."

"గుడ్. నాకు ఆకలిగానే ఉంది."

ఏమిటో చెప్తోంది శకుంతల.

రేవతి ఆమె తల పక్కనించి దూరంగా చెట్టుకింద జీవన్‌ని చూస్తూ, మధ్య మధ్య ఏదో జవాబిస్తోంది. శకుంతల నిరవధికంగా మాట్లాడుతోంది.

"జయంత్‌కి ఆ కళ్యాణి అంటే చాలా అభిమానంట.... ఎంత అభిమానం అయితే మట్టుకు బహిరంగంగా అంత విచ్చలవిడిగా తిరుగుతోన్న మనిషిని ఈ పార్టీకి పిలుస్తాడా? నాకు ముందు చూచాయగా తెలిసినా నమ్మలేదు. లేకపోతే వొచ్చేదాన్ని కాదు" అంటోంది శకుంతల.

"అవును!" అంది నీరసంగా రేవతి.

"అయినా, ఎంత మంచితనం ఉంటే మట్టుకేం? జయంత్ ఈ చిన్న వయసులోనే కోటీశ్వరుడై పోయాడు. అందంగా ఉన్న ఆడది అవుపిస్తే చాలు.... ఏం? లక్షణంగా పెళ్లి చేసుకోకూడదూ? సంసారుల్లో చక్కని వాళ్లు లేరూ? మర్యాదస్తుల్లో మంచి అందగత్తెలులేరూ? నో. అతనికి పెళ్లి అంటే పడదుట...." అంటూ నిట్టూర్చింది శకుంతల. కూర్చుంటే అంత స్పష్టంగా తెలీదుగానీ ఆమె ఈ సంవత్సరంలోనూ రూపాయికి అర్ధరూపాయి వొంతున వొళ్లుపెంచింది, అనుకుంది రేవతి.

"ఆ కళ్యాణి అంతేట. పుస్తకంతెచ్చుకుని బీరువాలో పెట్టినట్టు మగవాళ్లని కొంగుకి కట్టుకుంటుందట!.... సరే దానిమాటకేంగానీ...."

రేవతి కుర్చీలో కూర్చుని చెట్టువైపే చూస్తోంది.

మరో పదినిమిషాలు ఏదో చెప్పి శకుంతల మరో చోటుకి వెళ్లిపోయింది. ఆ పతిదేవు లావిడకి దొరక్కుండా ఎందుకు తిరుగుతున్నారో రేవతికి అర్థం అయింది.

నాలుగైదునిమిషాలు జీవన్, కళ్యాణి కనిపించలేదు.

తరవాత ఇద్దరూ రావటం చూసింది రేవతి.

చేతిలో చెయ్యివేసి ఒకరి ముఖంలోకి ఒకరు చూస్తూ ఏదో చెప్పుకుంటూ వొస్తున్నారు. మిగిలినవాళ్లకి చాలా దగ్గరగా వచ్చేవరకూ చేతులు కలిపే ఉన్నారు. చేతులు విడగానే ఆమె అటూ జీవన్ హాలువైపు వెళ్లిపోయారు.

ఇంక ఏం సందేహం ఉంది? అనుకుంది రేవతి.

అంత బాహాటంగా.... అలాగ-వాళ్లిద్దరూ!

తల తిరుగుతోన్నట్టు ఉంది రేవతికి. వాళ్లిద్దరి మధ్యా చనువు చూస్తే చాలా కాలపు చరిత్ర ఉన్నట్టు కనిపించింది.

దిగ్గున లేచి బయటికి నడవబోయింది.

"మా ఆయన్ని ఎక్కడైనా చూశారా?" అంటూ ఎదురైంది శకుంతల.

"ఇందాక అలా వెళ్లేరు" అని దూరానికి చెయ్యి చూపించి బయటికి నడిచింది రేవతి. బేగ్‌లోనించి తాళాలు తీసి కారు స్టార్టుచేసి ఇంటికి చేరింది.

మోసం.

ద్రోహం.

అనుకుంది రేవతి. చల్లటి మంచినీళ్లు తాగి కొంచెంసేపు సోఫాలో కూర్చున్నాక ఆమె షాక్‌నించి కొంచెం తట్టుకుంది. చేయవలసినదాన్ని గురించి ఆలోచనలో పడింది. ఇంతకాలం జీవన్ తననించి ఇది ఎలాగ దాచాడు? ఆమె లేకుండా జీవన్ సామాన్యంగా ఎక్కడికీ వెళ్లడు. ఊళ్లకి వెళ్లినా చాలాసార్లు తననీ తీసుకునే వెడతాడు. కళ్యాణికీ అతనికీ మధ్య ఇంతవరకూ రావడానికి అవకాశం ఎలాగ వొచ్చింది?

అంతకన్నా ముఖ్యం ఆ అవసరం ఎలాగ వొచ్చింది?

తనలో ఏమైనా లోపం ఉందా?

రేవతి తన ప్రవర్తని నిష్పక్షపాతంగా విమర్శించుకుంది. కొన్ని పొరపాట్లు తానూ చేసిన విషయం ఆమె ఈ సింహావలోకనంలో గుర్తించింది. రెండు మూడు సార్లు అతను చాలా ఉత్సాహంతో ఎక్కడికైనా వెళ్లాలనీ, ఎవరినైనా ఇంటికి పిలవాలనీ ప్రతిపాదిస్తే తాను అంగీకరించలేదు. 'నాకు ఒంట్లో బాగు లేదనో,' చేసుకోవాల్సిన పనులు చాలా ఉన్నాయనో అంది. అప్పుడు జీవన్ కొంతసేపు చిన్నబుచ్చుకున్నట్టు కనిపించేవాడు. కాని, త్వరలోనే మళ్ళీ మామూలు మనిషి అయేవాడు. తాత్కాలికంగానే అయినా అతన్ని అంతగా

తన అదుపులో పెట్టుకున్నందుకు సంతోషించిందని జ్ఞాపకం తెచ్చుకుంది రేవతి.

ఇలాంటివి అన్ని సంసారాల్లోనూ ఉంటాయి. అవి అతని ప్రవర్తనలాంటి పరిణామాలకి దారితియ్యడం సామాన్యంగా జరగదు. ఒకవేళ జరిగినా, తప్పకుండా కలహాలతోనో వాదోపవాదాలతోనో, ఆ సంగతి తెలిసి తీరుతుంది.

జీవన్ ఎందుకిలాగ అయిపోయాడు?

ఆలోచిస్తూ చాలాసేపు కూర్చుంది. కొంతసేపయాక అలిసిపోయింది రేవతి.

అతను రాగానే ఏదో తేల్చుకుందామనే ఒక సంకల్పం ఆమెలో బలపడసాగింది. ఆ ఆలోచనతోనే ఆమె నిద్రలోకి జారింది.

ఏదో కల.

రెండు బలమైన చేతులు ఆమెను చుట్టుకుంటున్నాయి. త్రుల్లిపడి లేచింది రేవతి.

జీవన్ ఆమెని రెండు చేతుల్లోనూ పొదివిపట్టుకుని బెడ్‌రూమ్‌లోకి తీసికెడుతున్నాడు.

పెనుగులాడి అతని చేతులు తప్పించుకుని దిగిపోయింది రేవతి.


నిద్రలోనే నడిచివెళ్ళి బెడ్‌మీద పడుకుంది. హాలులో గడియారం మూడు గంటలు కొట్టింది. అంటే జీవన్ తాను వెళ్ళిపోయినా, ఇప్పటిదాకా పార్టీలో ఉన్నాడన్నమాట. లేక, తన తరవాత బయలుదేరి ఎక్కడ తిరిగివొచ్చాడో!

ఆ ఆలోచన మళ్ళీ నిద్రరాకుండా చేసింది. కళ్లు విప్పకుండా ఆమె మిగిలిన రాత్రి అలాగే గడిపింది.

జీవన్ రెండుమూడు నిమిషాలలో నిద్రపోగలగడం ఆమెకి సంతోషం కలిగించలేదు. నిజానికి అతను మధన పడాల్సింది.

ఆ తరవాత వారం పదిరోజులు ఆ ఇంట్లో సుఖశాంతులు లేవు.

ఉన్నది నిర్లిప్తత, నిశ్శబ్దం.




ఒక్కసారి జీవితం అంతా మారిపోయినట్టు ఉంది రేవతికి. జీవన్‌మీద ఆమె కోపం రోజురోజుకీ ఎక్కువౌతూ వొచ్చింది. ఆ రాత్రి జరిగినదానిలో ఆమెకి పెద్ద అవమానం జరిగిందనే భావన మరీ బలవత్తరం అవసాగింది.

ఒకసారి జీవన్ అడిగాడు; "ఎందుకలా ఉన్నావని."

"ఎలా ఉన్నాను?" అంది రేవతి.

"అదే. మాట్లాడవు. చిరునవ్వు మాట సరే సరి! నావైపు చూడడం కూడా మానేశావు."

"ఎందుచేత?"

"అదే అడుగుతున్నాను."

"నిజంగా మీకు తెలీదా?"

"తెలీదు"

కోపంతో బిగబట్టుకుపోయింది రేవతి. ఏమీ తెలియనట్టు నటిస్తున్నాడు జీవన్.

"మీకంతా తెలుసును" అంది చివరికి.

"అంతా అంటే ఏమిటి?"

"మీరు-చేసింది. మీ ప్రవర్తన."

"ఏం చేశాను?"

రేవతి మాట్లాడలేదు. తనకే అన్యాయం జరిగినట్టు ప్రవర్తిస్తున్నాడు జీవన్. అతను బతిమిలాడినా రేవతి ముఖం తిప్పుకుని మౌనంగా ఉండిపోయింది.

మరో రెండు రోజులు పోయాక జీవన్ చాలా ఉత్సాహంగా వొచ్చాడు.

"రేవతీ! రేవతీ!" అని గట్టిగా పిల్చాడు- పూర్వంలాగే. సోఫాలో కూర్చుని జోళ్లు విప్పుకుంటూ తన నలాగ పిలవడం అతనికి అలవాటు.

ఆమె పుస్తకం చదువుకొంటోంది. వంటవాడు టీ ఇస్తాడులేనని తీమె లేవలేదు.

మళ్లీ పిలిచినా ఆమె చలించలేదు.

ఆమె గదిలోకి వచ్చాడు జీవన్,

"పుస్తకం అంత బాగుందా? అంత గట్టిగా పిలిచినా వినపడలేదు!" అన్నాడు నవ్వుతూ.

పుస్తకం పక్కన పడేసి, "ఏమిటి" అంది రేవతి.

"ముందు టీ ఇయ్యి."

"వాడు ఇవ్వలేదూ?"

"లేదు.... వొద్దన్నాను."

"ఏం?"

"వాడిస్తే నాకు బాగుండదు."

దీనికేం చెప్పాలో తెలీలేదు రేవతికి.

"సరే-పదండి. నేను తెస్తాను" అని, లేచి వెళ్లి తెచ్చింది.

గారెలు టిఫిను తింటూ, "బాగున్నాయి" అన్నాడు.

రేవతి ఏమీ అనలేదు.

"నువ్వు తిను" అన్నాడు.

వొద్దని తల ఊపింది రేవతి.

"అలా అనకు. నీకు ఆకలివేసేసైమిది!" అంటూ ఒక గారె తుంచి ఆమె నోట్లో పెట్టబోయాడు.

"ప్లీజ్ నన్ను బలవంతం పెట్టవొద్దు" అంది రేవతి.

"పోనీ. టీ తాగు."

రెండు కప్పులు టీ చేసి తానొకటి తీసుకుని ఆమె కొకటి ఇచ్చేడు. కొంచెం సేపు నిశ్శబ్దంగా గడిచిపోయింది.

"గుడ్ న్యూస్ తెచ్చాను" అన్నాడు జీవన్.

"అలాగా!" అంది రేవతి.

"ఏమిటో తెలుసుకోవాలని లేదా!" అన్నాడు జీవన్.

"చెప్పేదైతే మీరే చెప్తారు."

"నీకు చెప్పేది ఏమీలేదు."

"అవునవును" అంది రేవతి వెటకారంగా.

జీవన్ చిరునవ్వు పోకుండా, "అంటే?" అన్నాడు.

"ఏమీలేదులెండి" అంది.

క్షణం ఆగి, "పద ఏదైనా సినిమా చూసి వొద్దాం" అన్నాడు జీవన్.

"మీరు వెళ్ళిరండి" అంది రేవతి.

"కాదు. నువ్వూ రా."

"నో," అంది రేవతి.

"ఏం?"

"రావాలని లేదు. అంతే."

"కాని. నువ్వు రాకపోతే నాకు బాగుండదు."

"ఫరవాలేదు."

"కంపెనీ లేకుండా సినిమా ఏమిటి? నాకలాగ నచ్చదు."

"మీ ఫ్రెండుని రమ్మనండి."

"ఎవరిని?"

"ఎవర్తె తేనేం?- కాకపోతే కళ్యాణిని రమ్మనండి."

"కళ్యాణి?- ఆమె గురించి నీకెలాగ తెలుసును?" అన్నాడు. జీవన్.

"ఏం? అంత రహస్య మనుకున్నారా?" అంది రేవతి.

"కాదులే. కాని, ఇలాంటి మాట నువ్వు నమ్ముతావని అనుకోలేదు," అన్నాడు జీవన్.

"కళ్యాణి నమ్మదగిన మనిషి కాదు, అది మీరు ఒప్పుకోవచ్చు" అంది రేవతి.

"ఆమె విషయం వొదిలీ. అదికాదు ప్రశ్న. నన్ను నమ్మలేవన్నమాట" అన్నాడు జీవన్ కొంత బాధగా.

"అదీ ప్రశ్నకాదు.... నా కళ్లని నేను నమ్మడమా మానడమా అనేది ప్రశ్న. దానికి సమాధానం నాకు తెలుసును. మీకూ తెలుసును."

"అంటే...."

"అవును. ఆ రాత్రి చూశాను."

"అందుకే నన్నమాట అంత తొందరగా వొచ్చావు."

"మరేమనుకున్నారు?"

"అలసిపోయావు కాబోలు- వెళ్ళిపోయా వనుకున్నాను."

"అలాగా!" అంది రేవతి పొడిగా.

కొంచెంసేపు ఆగి, "చూడు రేవతీ! నీకు నన్నేమైనా అడగాలని ఉంటే అడుగు. నా తత్వం నీకు తెలుసును.... ఉన్నమాట చెప్తాను." అన్నాడు జీవన్.

"అడగడానికేముంది? అంత పబ్లిగ్గా చెయ్యీ చెయ్యీ పట్టుకుని తిరిగినవారు- అదీ అంత మందిమధ్యన- చెప్పేందుకు మిగిలిందేమిటి?" అంది కోపంతో రేవతి.

"అలా ఎందుకుచేశానో అడగొచ్చును"

"తెలీకపోతేగద అడగడం!...."

"నా గురించి నీకు తెలుసును."

"కళ్యాణి గురించీ తెలుసును."

"విన్నవన్నీ నమ్మకూడదు."

"చూసినవో?" అంది రేవతి బాధతోనూ కోపంతోనూ.

నిట్టూర్చి లేచి లోపలికి వెళ్ళేడు జీవన్.

రేవతి కొంత నిరుత్సాహ పడింది. జీవన్ తనకు తానే కళ్యాణి విషయానికి మళ్లించడం, చెయ్యరానిదేదీ చెయ్యనట్టే ప్రవర్తించడం.... ఆమెకి మరింత కోపం కలిగించాయి. అయితే జీవన్ పూర్తిగా నిర్దోషి అయినా అయిఉండాలి. లేదా, అతను జరిగినదానికి పూర్తిగా సంతోషిస్తూ ఉండాలి. తన కళ్ల సాక్ష్యమే లేకపోతే, అతన్ని ఏమైనా అనేందుకు ఏ పరిస్థితుల్లోనూ ఆమె అంగీకరించి ఉండేదికాదు.

"చేతులు కలుపుకుని నడిస్తే.... అది నువ్వనుకున్న దానికి సాక్ష్యం కాదు రేవతీ," అన్నాడు జీవన్ తిరిగివస్తూ.

"అలాగా!" అంది రేవతి.

"అవును."

"చెట్ల వెనకాతల గుసగుస లాడడమూ.... కాదనుకుంటాను."

"కాదు."

"సరే. ఆ మాట మీరన్నాక వాదించేదానికేముంది?" అంది రేవతి కోపంతో దహించుకుపోతూ.

"ఇది...." అన్నాడు రవి, ఒక కవరు ఆమెముందు పడేస్తూ.

"ఏమిటీ?" అంది రేవతి.

"నేను బయటికి వెళ్లాక చూడు- నీ ప్రశ్నలకి జవాబు దొరుకుతుంది...." అని, జీవన్ చెప్పులు వేసుకుని బయటికి వెళ్ళేడు.

ఏమీ అర్థంకాలేదు రేవతికి.

కవరు తెరిచి చూసింది. లోపల ఒక ఫోటో. అందులో ఒక అమ్మాయి, ఒక అబ్బాయి. ఇద్దరూ నవ్వుతున్నారు- చెయ్యీ చెయ్యీ కలుపుకుని ఒకరి కళ్లలోకి ఒకరు చూసుకుంటూ నడుస్తున్నారు.

ఒక్కసారి నీరసించిపోయింది రేవతి.

ఆ అమ్మాయి రేవతి.

అతను- శివరామ్.

నాలుగేళ్ళ కింపటి కథ తాను పూర్తిగా మరిచేపోయింది. ఈ ఫోటో ఉందని ఆమెకి తెలీదు. అదీ, జీవన్ దగ్గర!

ఆ రోజు. అంతా పూర్తిగా మెరుపు లాగ ఒక్కసారి కళ్ళముందుకి వొచ్చింది.

శివరామ్ అంటే తనకి చాలా అభిమానం ఉండేది. క్లాసు మొత్తంమీద అతనొక్కడితోనే, ఆ మాత్రమైనా చనువు ఉండేది. అతని మర్యాదా, మన్ననా, ఆమెకి చాలా నచ్చేది. క్లాసులో చాలా మంది బాగాఉన్నవాళ్ళే. వాళ్ళందరూ అతన్ని అవకాశం చిక్కినప్పుడల్లా ఆట పట్టించేవారు. వీలైనంతవరకూ శివరామ్ కూడా పుచ్చుకున్నంతా ఇచ్చేవాడు. కాని, పదిమందిని ఎంతవాడైనా ఒంటరిగా ఎదుర్కోవడం కష్టం. శివరామ్ ఏ పరిస్థితుల్లోనూ వాళ్ళమీద కంప్లెయింట్ చేసేవాడుకాదు. లేకపోతే మరీ కష్టసమయాలలో అతని చిరునవ్వు మాయమై గంభీరత ముఖంలోకి వచ్చేది. అంతే. అందుకే ఆమెకి అతనంటే అభిమానం.

క్లాసులో ఈ హీనమైన అల్లరిచేసే వాళ్ళకి కామరాజు లీడరుగా ఉండేవాడు. అతని తండ్రి ఏవో రాజకీయాల్లో అధికారం, డబ్బూ చేసుకునేవాడు. ఆ రెండూ పుష్కలంగా ఉన్నవాళ్ళకి ఉండే గర్వం, క్రౌర్యం పూర్తిగా ఉండేది కామరాజుకి. మొదట అతను రేవతితో స్నేహంచేసే ప్రయత్నం చాలా చేశాడు. నోట్సు అడిగేవాడు. తన పుట్టినరోజు పార్టీకి పిలిచేవాడు. సినిమాకి రమ్మనేవాడు. ఏదీ కాదన్నాక, ఆశ మిగలకపోయాక రక రకాలుగా ఆమెని గొడవచేసేవాడు. ఒకసారి రూములోకి ఆమె వొస్తోంటే కావాలని డాష్‌చేశాడు. చేతులో ఉన్న బరువైన పుస్తకంతో అతని ముఖంమీద కొట్టి, నాలుగు రానిచ్చింది రేవతి.

"పొరపాటు అందరూ చేస్తారు. నేను చూసుకోలేదు." అన్నాడు కామరాజు, పెదవినించీ, ముక్కులోనించీ వొస్తూన్న రక్తం తుడుచుకుంటూ.

"ఆ పొరపాటే నేనూ చేశాను. ఇంకొంచెం జరగలేదు. పిటీ" అంది రేవతి.

అప్పటినించీ వాడు తన జోలికి రావడం మానేశాడు.

కాని, శివరామ్‌మీద దాడి మరింత ఉధృతంగా చెయ్యడం మొదలుపెట్టేడు. ఒకసారి శివరామ్ కాలేజీ ఫీజూ, పరిక్ష ఫీజూ కట్టలేకపోయాడు. అదే సమయంలో ఎక్స్కర్షన్‌కి కూడా డబ్బు కట్టాలి. క్లాసులో ఎవరో చాలా ఆనందంగా ఈ విషయాలని గురించి చర్చిస్తోంటే తాను విన్నది.

రేవతి చాలా బాధపడింది. మంచి మార్కులు వచ్చేవి శివరామ్‌కి. లేమివల్ల అతనికి కాలేజీ చదువు దినదిన గండం లాగ ఉంది. అలాంటి బాధలు లేకపోయినా, అతనికి ఆ డబ్బు- ఏడెనిమిది వొందలు- పిలిచి ఇచ్చే పరిస్థితిలో లేదు. ఇవ్వగలిగి ఇచ్చినా, అది అంగీకరించని ఆభిజాత్యం అతనిలో ఉందనీ రేవతికి తెలుసును.

రెండు రోజులు చాలా బాధపడిపోయింది రేవతి. తానేమీ చెయ్యలేకపోవడం ఆమె బాధని మరికొంత ఎక్కువ చేసింది.

మూడోరోజున సుభద్ర నవ్వుతూ వొచ్చి, "మీ హీరో కథ విన్నావా?" కామరాజుకి దూరపు చుట్టరికమూ, దగ్గరగా స్నేహమూ ఉన్నది శకుంతలకి.

"ఏమిటది?" అంది చికాకుతో, రేవతి.

"అందులో నీకూ ఒక పాత్ర ఉంది హీరోయిన్‌గారూ!" అంది సుభద్ర నవ్వుతూ.

"ఊరికే వాగకు. చెప్పేది చెప్పు" అంది రేవతి.

"మీ హీరో కాలేజీ మానేస్తాడుట..." అంది సుభద్ర.

"పాపం! డబ్బు దొరకలేదన్నమాట!" అంది రేవతి.

"వాళ్ళ నాయన చిన్న అయ్యవారుట. వాళ్ళకుండే ఆస్తి తెలుసుగా! ఈయనకి ఎనిమిది అక్కలూ అన్నలూ చెల్లెళ్ళూ తమ్ముళ్ళూట. ఎలా వొస్తుంది? వాళ్ళ మేనమామ పంపించేవాడుట. కూతురికి అడ్వాన్సు కట్నం అన్నమాట!"

తల ఊపింది రేవతి.

"కామరాజు అంతా తాను పెట్టుకుంటానన్నాడు...."

ఆశ్చర్యపడింది. "కామరాజా?"

"ఆఁ.... ముష్టి అక్కర్లేదన్నాడుట హీరోగారు."

"అవును. అతను బలే పౌరుషం ఉన్నవాడు."

"అతనికి నువ్వంటే చాలా అభిమానం."

"అవును. మంచి స్నేహితుడు."

"తెలుసు. నీకు అతనంటే...."

"చెప్పు" అంది వాడిగా, రేపతి.

"అభిమానం" అంది శకుంతల.

"అవును...."

"అందుకే ఈ పందెం కట్టేడు కామరాజు"

"పందెమా? ఏమిటదీ?"

"సింపుల్. పార్కులో అతను- అదే, హీరో, నువ్వూ చెయ్యీ చెయ్యీ కలుపుకుని ఆరు నిమిషాలు తిరిగితే- వెయ్యి రూపాయిలిస్తాడుట!"

రేవతి ఆశ్చర్యంతో, కోపంతో మాట్లాడలేదు.

"బలే రొమాంటిక్‌గా ఉంది కాదూ? కామరాజు అయిడియాలన్నీ అలాగే ఉంటాయిలే.... బ్యూటిఫుల్!"

"ఏమిటా బ్యూటీ?" అంది రోషంగా, రేవతి.

"ఐడియా. నీకూ మీ హీరోకీ ధైర్యం ఉంటే అతని సమస్యలు ఆరునిమిషాలలో పటాపంచలై పోతాయి. మీ రిద్దరూ

ఓడిపోతే– అందరూ మిమ్మల్ని చూసీ, మీ గురించి చెప్పుకునీ, నవ్వుతారు."

ఆలోచించి అది నిజమే ననుకుంది రేవతి.

కామరాజు– నిలువునా విషం మనిషి.

లోపల పొంగుతున్న ఉద్రేకంతో, "ఆ డబ్బు తెమ్మను. రేపు సాయంత్రం" అంది రేవతి.

ఆశ్చర్యంగా, "నిజంగా" అంది సుభద్ర.

"ఏం! మీ బాయ్‌ఫ్రెండు దగ్గర డబ్బు లేదా ?" అంది రేవతి.

చీత్కారంతో, "అతనికేం ? ఈ వెయ్యా రెండో వేలూ ఒక లెక్కకాదు" అంది సుభద్ర.

ఆ రాత్రి నిద్రరాలేదు రేవతికి. ఉద్రేకంలో ఆ పందెం కట్టింది. కాని, తాను చెయ్యాల్సింది తలుచుకుంటే ఆమెకి చాలా భయంగా ఉంది. ఈ వార్త తెలిస్తే నాన్న ఏమంటారు? అమ్మ ఏమంటుంది? ఇప్పటికే గోడలమీద పేర్లు రాశారు రాస్కెల్స్. ముందు ముందు తనమాట ఏమవుతుంది ?

అసలు శివరామ్ అంగీకరిస్తాడా ? అటెను కావంటే బాగుండును.... కాని, అతని చదువు ? భవిష్యత్ అంతా రేపు జరిగేదానిమీద ఆధారపడి ఉంటుంది. అతనికి ఏమీ నష్టం కలుగకపోవొచ్చు. తనకి చాలా నష్టం కలుగవొచ్చును.

మర్నాడు శివరామ్ ఆమెకోసం ఎదురు చూస్తూ కనిపించాడు.

"ఇది– నిజమేనా ?" అన్నాడు పందెం మాటా, ఆమె అంగీకారాన్నీ గురించి ప్రస్తావిస్తూ.

"అవును. ఏం ? మీకు భయంగా ఉందా ?" అంది అప్పటికే ఆలోచనల్లో సతమతమైపోయిన రేవతి.

"అవునండీ! నాకు భయంగానే ఉంది. మీరనుకున్న భయంకాదు. ఈ పనిచేస్తే మీ రివ్వవలసిన ఖరీదు తలుచుకుని. నాకేం! నేను బాగానే ఉంటాను." అన్నాడు శివరామ్.

"ఫరవాలేదులెండి... జీవితంలో కొన్ని ప్రమాదాలనించి పరిగెట్టడం అంతకన్నా పెద్ద ప్రమాదాలకి తావిస్తుంది" అంది.

కొంచెం ఆలోచించి, "అది మీ పరిస్థితికి ఎలాగ అన్వయిస్తుందో నాకు బోధపడడంలేదు" అన్నాడు శివరామ్.

"ఆ చర్చ ఇప్పుడొద్దులెండి.... వీళ్లందరూ ఆడియన్స్‌గా వొస్తారనుకుంటాను. సాయంత్రం రండి. లేకపోతే నా పరువు పోతుంది" అంది రేవతి.

తల ఊపేడు శివరామ్.

ఏ క్షణంలోనైనా కన్నీళ్లు వొచ్చేలాగ ఉంది అతని ముఖం.

ఆ సాయంత్రం....

మళ్ళీ ఫొటోవంక చూసింది రేవతి.

ఆ ఆరునిమిషాలూ ఎలాగ గడిచేయో! రెండుసార్లు కిందకీ మీదికీ ఆ పార్కులో నడిచారు. చెయ్యీ చెయ్యీ పట్టుకుని ఒకరి కళ్లలోకి ఒకరు చూస్తూ. వాళ్లందరినీ ఏడిపించాలని– నవ్వుతూ. అమ్మకీ నాన్నకీ తెలియలేదు.... లేక....?

చెమటపోసింది రేవతికి. తనకి తెలీనివి చాలా జరిగాయన్నమాట.

ఈ ఫొటో జీవన్‌కి ఎలాగ వొచ్చింది? అప్పటి ఎక్సైట్‌మెంటులో ఫొటో తీసిన సంగతే తనకి తెలీదు. అది చూస్తే తనకే ఇలాగ ఉంది. జీవన్ ఏమనుకున్నాడు ? ఈ ప్రసక్తి అతనెప్పుడూ తేలేదు. ఎంచేత ?

ఆలోచిస్తూ చాలాసేపు కూర్చుంది రేవతి.

కళ్యాణి, జీవన్– తనలాగ, శివరామ్ లాగానా ?

ఏమిటో. అంతా అయోమయంగా ఉంది ఆమెకి.

మరికొంచెం సేపయ్యాక వొచ్చాడు జీవన్.

"ఈ ఫోటో ఎవరిచ్చారు మీకు ?" అంది అతను కూర్చోగానే, రేవతి.

"ఎవరైతేనేంలే" అన్నాడు జీవన్.

"పోనీ– ఎప్పుడిచ్చారు ?" అంది రేవతి.

పెళ్లిచూపులకి వొచ్చే ముందురోజు... పోస్టులో పంపేరు."

"మరి.... మీరు నన్నెప్పుడూ ఈ విషయం అడగలేదేం ?" అంది గొంతుక ఎండి పోయినట్టు, రేవతి.

"నాకు తెలుసును."

"అయినా చెప్పండి"

"వొద్దు.... నీకు తెలుసు.... నాకూ తెలుసు...."

ఫోటో తీసుకుని చిన్న చిన్న ముక్కలుచేసి కిందకి పడేశాడు జీవన్." ఇది పూర్తిగా మరిచిపో.... అసలు నేను ఈ ఫోటో ఉంచడం తప్పు. నీకు చూపడం మరీ తప్పు. అదీ ఈ సందర్భంలో.... నన్ను క్షమించు."

అతను లేచి నిలబడ్డాడు!

రేవతి అతని చేతుల్లోకి వెళ్లిపోయింది. ఆపుకోలేని దుఃఖం ఆమెని మాట్లాడ నివ్వడంలేదు. కాని, ఏదో చెప్పబోతోంది.

"ఏమిటి రేవతీ, ఏమిటీ" అన్నాడు జీవన్.

జవాబుగా ఆమె అతనికి మరింత దగ్గరగా అయిపోయింది. చాలా సేపటి వరకూ ఇద్దరూ మాట్లాడలేదు.

చివరికి రేవతి, "ఒక్కటి అడుగు తాను మిమ్మల్ని" అంది.

"అడుగు" అన్నాడు జీవన్.

"మీకు.... మీకు.... అమ్మాయి కావాలా ? అబ్బాయా ?" అంది, అతని కళ్లల్లోకి చెప్పలేనంత ప్రేమగా, జాలిగా, చూస్తూ.

———